హైదరాబాద్ వార్త



# మెడి"కిల్" షాపులు!

పేరొకరిది.. షాప్ మరొకరిది.. మెడికల్ షాపు ఏర్పాటు చేయాలంటే ఫార్మసీ సర్టిఫికెట్ అవసరం ఉంటుంది. ఆ సర్టిఫికెట్ ఆధారంగా అధికారులు లైసెన్స్ జారీ చేస్తారు. వైద్యం వ్యాపారంగా మారిన క్రమంలో కొంతమంది ఫార్మసీ చేసే ఉన్నత చదువులు చదివేవారికి సంబంధించి ఫార్మసీ సర్టిఫికెట్లను అద్దెకుపేరిట తీసుకుని లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. సర్టిఫికెట్‌లో ఉన్న పేరుతోనే లైసెన్స్ మంజూరవుతుంది. సదరు ఫార్మాసిస్టు షాపులో తప్పనిసరిగా ఉండి మందులు విక్రయించాల్సి ఉంటుంది. కానీ నగరంలోని చాలాషాపుల్లో అవగాహన లేనివారితో మందులు విక్రయిస్తున్నారు.

- పేరొకరిది.. షాప్ మరొకరిది
- అద్దె సర్టిఫికెట్లతో వ్యాపారం
- పరిజ్ఞానం లేనివారితో విక్రయం
- పట్టించుకోని "ప్రిస్క్రిప్షన్" నిబంధన
- పత్తాలేని డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు
- మామూళ్ల మత్తులో ప్రజారోగ్యానికి తూట్లు



హైదరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త: ఇటీవల ఒమహిళ విపరీతమైన తలనొప్పితో రావడంతో మెడికల్ షాపులో మాత్ర కొనుక్కుని వేసుకుంది. రెండుగంటల తర్వాత ఆమెకు వాంతులు కావడంతో ఆస్పత్రికి తరలించారు. సకాలంలో డాక్టర్ వద్దకు తీసుకుపోవడంతో ప్రాణాపాయం నుంచి బయట పడింది. దీనికి షాపులో పనిచేసే వ్యక్తి బీఫార్మసీ చేసిన వ్యక్తి కాకపోవడం అవగాహన లేకపోవడం. గ్రేటర్‌లోని మెడికల్ షాపుల యజమానులు ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఒ వ్యక్తి మందుదుకాణం, మరోపక్క క్లినిక్‌ను నడిపిస్తూ రెండు చేతులా సంపాదిస్తున్నారు. కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లే ఖర్చు ఎక్కువవదని ఇక్కడికి వచ్చే పేద రోగులను అర్హతలేని వైద్యులతో పరీక్షలు నిర్వహిస్తూ వారి ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్నారు. అద్దె సర్టిఫికెట్లతో లైసెన్స్ తెచ్చుకుని పరిజ్ఞానం లేని వ్యక్తులతో మందులు విక్రయం చేపడుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఇలాంటి వందలసంఖ్యలో ఉన్నాయి. ముఖ్యంగా బస్తీలు, శివారు ప్రాంతాలలో విచ్చలవిడిగా నడుస్తున్నాయి. వైద్యుడి ప్రిస్క్రిప్షన్ ఉంటేనే మందులు అందించాలనే ప్రభుత్వ నిబంధన ఉన్నా దానినెవరూ పట్టించుకోవడం లేదు. తమకున్న బాధను చెప్పి మందులడిగిన వారికి నకిలీవి అంటగడుతూ పెద్ద మొత్తంలో డబ్బులు దండుకుంటున్నారు. అలాగే జనరిక్ మందులపై సైతం ఎక్కువ ధరకు విక్రయిస్తూ అక్రమాలకు పాల్పడున్నారు. అడిగిన వారికి తప్ప రశీదులను కూడా ఎవరికీ ఇవ్వడం లేదు. వీటన్నింటిని పట్టించుకోవాల్సిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు పత్తా లేకుండా పోతున్నారు. మామూళ్ల మత్తులో జోగుతూ వీరు ప్రజారోగ్యానికి తూట్లు పొడుస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**చెలామణిలో నకిలీ..** మెడికల్ షాపుల్లో మార్కెట్ మందుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వివిధ ప్రాంతాల్లో నాణ్యతా లోపంతో తయారు చేసిన వివిధ రకాల మందులను అమ్మే హోల్‌సేలర్లు అతితక్కువ ధరపై వీటిని రిటైలర్లకు సరఫరా చేస్తున్నారు. ఈ మందుల ధరలు వారికి అసలు ధరకంటే 70శాతం నుంచి 50శాతం వరకు తక్కువతో సరఫరా అవుతాయి. వీటిని బ్రాండెడ్ మందుల ధరతో రోగులకు అంటగడుతున్నారు. ఈ మందులనే డాక్టర్లు రాసేలా వారికి నజరానాలు అందిస్తున్నారు. వాస్తవానికి మెడికల్ షాపులకు సరఫరా అయ్యే మందులలో కొన్ని ముఖ్యమైన మందులు "షెడ్యూల్ హెచ్" "హెచ్1"కేటగిరీలో సరఫరా అవుతాయి. అలాంటి మందులను డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే విక్రయించాలి. ఈమేరకు రిజిస్టర్ మెయింటెన్ చేస్తే కొనుగోలు చేసిన మందులు ప్రతిరోజు రిజిస్టర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఎలాంటి ప్రత్యేక రిజిస్టర్లు మెయింటెన్ చేయడంలేదు. కొన్ని మెడికల్‌షాపుల్లో రాత్రి షాపు మూసేసేముందు కొన్నిమందులకు సంబంధించి బిల్లులుకట్ చేస్తూ నిబంధనల నుంచి తప్పించుకుంటున్నారు.

**తూతూమంత్రంగా తనిఖీలు..**
నిత్యం మెడికల్ షాపులను తనిఖీలు చేయాల్సిన ఔషధ నియంత్రణశాఖ అధికారులు, యేడాదికి ఒక్కసారికూడా తనిఖీ చేయడం లేదు. ప్రతి మూడు నెలలకోసారి, ఆరునెలలకు, ఏడాదికి మామూల్లు అందుతుండటంతో చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. అన్నిసక్రమంగా ఉంటే అధికారులు మూమూళ్లు ఎందుకిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## ఇంకా కొనసాగుతున్న పిహెచ్‌డీ ఫలితాల సమస్య

**ఒయూ పరిపాలనాభవనంలోకి దూసుకెళ్లిన విద్యార్థులు**



ఒయూ పరిపాలనాభవనం ముందు రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మినారాయణతో వాగ్వాదం చేస్తున్న విధ్యార్థి నేతలు

తార్నాక, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: పీహెచ్‌డీ ఫలితాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ బుధవారం కూడా విద్యార్థులు ఆందోళన చేసేందుకు యత్నించారు. పోలీసులు, సెక్యూరిటీ గార్డులు అధిక సంఖ్యలో మోహరించి పరిపాలనాభవనంలోకి వెళ్లకుండా అడ్డుకు న్నారు. పోలీసుల అనుమతితో కొందరు విద్యార్థులు రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మినారాయణను కలిసేందుకు ఆయన కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా అప్పటికే ఆయన కార్యాలయం నుంచి కిందకు వచ్చారు. బయటకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న రిజిస్ట్రార్ ప్రొ. లక్ష్మినారాయణ ను విధ్యార్థులు అడ్డుకున్నారు. తమకు అర్హత మార్కులను ఒయూ పెంచడం వల్ల తమకు అన్యాయం జరుగుతుందని వాగ్వాదానికి దిగి బెదిరింపు దోరణీతో దుర్భాషలాడారు. అక్కడున్న పోలీస్ అధికారులు కూడా కేవలం ప్రేక్షక పాత్ర వహించారు.

**పోలీసుల ముందే భౌతికదాడులు చేస్తామని బెదిరించడం ఎంతవరకు సబబు : రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మినారాయణ**

యూజీసీ నిబంధనల ప్రకారమే పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి అర్హత పరీక్షలు నిర్వహించామని రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మినారాయణ పేర్కొన్నారు. ఇకపై ఏట పిహెచ్‌డీ ప్రవేశపరీక్షలు నిర్వహించ నున్నట్లు వెల్లడించారు. అర్హత సాధించని విధ్యార్థులకు ప్రవేశాలు కల్పించలేమన్నారు. కొందరు విద్యార్థులు తమతో భౌతిక ధాడులు చేస్తామని హెచ్చరించడం జరిగిందని ఇది సరైన పద్దతి కాదన్నారు.

## ఘనంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



స్వామి వారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

మలక్‌పేట్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: మూసారంబాగ్ ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీలోని శ్రీవేంకటేశ్వర స్వామి వారి బ్రహోత్స వాలు ఘనంగా జరువుతున్నారు. బ్రహోత్సవాల్లో భాగంగా సాముహిక సుప్రభాత సేవ, నాగ రాజు, నాగదేవతల వద్ద ఈశ్వరునికి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి రుద్రాభిషేకం, చక్రస్నానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పూర్ణచందర్‌రావు మాట్లాడుతూ దేవాలయం ప్రధాన అర్చకులు జ్వాల నర్సింహ్మా, టీటీడీ వేదపండితుల పర్యవేక్షణలో శ్రీవేంకటేశ్వర స్వామి వారి చతుర్వింశత 24వ బ్రహ్మోత్సవాలు, శ్రీశివ పార్వతి అమ్మవార్ల 15వ పంచదశ బ్రహ్మోత్సవాలు, మహాకుంబాభిషేకం తధితర పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్దలతో వైభవంగా నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ పూర్ణచం దర్‌రావు, శారధ దంపతులు, వివిఎస్ హరిష్, వైస్‌చైర్మన్ విశ్వేశ్వరరావు, కార్యదర్శి కుమార్, పురోహిత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## తెలంగాణ తమిళ భవన్ ఏర్పాటు చేయాలి

**తెలంగాణ తమిళ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కె.బోస్**

చిక్కడపల్లి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర రాజధాని నగరంలో తమిళులకు ప్రత్యేక 'తమిళ భవన్' నిర్మించాలని తెలంగాణ తమిళ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కె.బోస్ డిమాండ్ చేశారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో వార్షికోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంకె.బోస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో తమిళులు సుమారు 9లక్షలకుపైగా జనాభా ఉన్నారని, ఈ విషయంలో గతంలో మంత్రి కెటిఆర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, మంత్రి సానుకూలంగా స్పందించారని, ప్రత్యేక స్థలం కేటాయింపు జరగలేదని, మలయాళీల మాదిరిగానే తమిళులకు కూడా ప్రత్యేక స్థలం, భవన నిర్మాణం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.రాజ్‌కుమార్, సంఘం ఉపాధ్యక్షుడు పి.ధర్మసీలాన్, కోశాధికారి ఎన్.నెహ్రూశాస్త్రి, ఉప కోశాధికారి టి.కుమార రాజన్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగల్ తయారీ, ఆటలు, డ్రాయింగ్ పోటీలు, సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు, తమిళ క్విజ్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

## రెవెన్యూ సెక్రెటరీని కలిసిన తెలంగాణ తహాశీల్దార్స్ అసోసియేషన్



రాష్ట్ర భూ రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్‌ను కలిసిన తెలంగాణ తహాశీల్దార్స్ అసోసియేషన్ ప్రతినిధులు

చార్మినార్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : రాష్ట్ర భూ రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమితులైన నవీన్ మిత్తల్‌ను బుధవారం తెలంగాణ తహాశీల్దార్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాములు, సెక్రటరీ జనరల్ ఎస్‌పిఆర్ మల్లేష్ కుమార్, కార్యదర్శి రమేష్‌తో పాటు పలువురు ప్రతిని ధులు కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర భూ రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ తెలంగాణ తహాశీల్దార్స్ అసోసియేషన్ 2023 కొత్త క్యాలెండర్‌ను అవిష్కరించారు.

## ఆలయ నిర్మాణానికి రూ.2,01,116ల విరాళం



విరాళం చెక్కును అందజేస్తున్న పారిజాత నర్సింహారెడ్డి

సరూర్‌నగర్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరు మండలం కొత్తగూడ గ్రామంలో నిర్మాణం జరుగుతున్న శ్రీ సత్య సూర్య నారాయణ రామ లింగేశ్వర ఆంజనేయ స్వామి ఆలయానికి టిపి సిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి రూ.2,01,116లను విరాళంగా ఇచ్చారు. బుధవారం ఆలయ భూమి పూజ సందర్భంగా ఆమె పలువురు కాంగ్రెస్ నేతలతో కలిసి కార్యక్రమంలో పాల్గొని విరాళం చెక్కును ఆలయ కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, బడంగ్‌పేట్ మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే ప్రయాణికుల భద్రతకు ప్రత్యేక చర్యలు

**రైల్వే ప్రొటక్షన్ పోర్స్ సీనియర్ సెక్యూరిటీ కమిషనర్ డెబస్ స్మితా సి.బెనర్జీ**



కంటోన్మెంట్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: రైల్వే ప్రయాణికుల భద్రత కోసం నిరంతరం కృషి చేస్తున్నామని రైల్వే ప్రొటక్షన్ పోర్స్ సీనియర్ సెక్యూరిటీ కమిషనర్ డెబస్ స్మితా సి.బెనర్జీ తెలిపారు. బుధవారం సికింద్రాబాద్‌లోని సంచాలన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రయాణికుల భద్రత, నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. జాతీయ భారతీయ రైల్వేలో ప్రయాణించే ప్రయాణికుల భద్రతను మెరుగుపర్చాలనే లక్ష్యంతో సేవాహి సంకల్ప్ పేరుతో పాన్ ఇండియా అపరేషన్‌ను ప్రారంభించామన్నారు. 2022లో మిషన్ అపరేషన్ యాత్ర సురక్ష ద్వారా సికింద్రాబాద్ డివిజన్‌లో 112 మందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి 113 మంది ప్రయాణికుల నుంచి దోచుకున్న సొత్తును స్వాధీనం చేసుకొని తిరిగి బాధితులకు అప్పగించామన్నారు. అదేవిధంగా 2022 సంవత్సరంలో నేరస్థులను పట్టుకోవడంలో 70 శాతం పెరుగుదల సాధించినట్లు అమె తెలిపారు.

**మహిళా ప్రయాణికుల భద్రతకు శక్తిటీమ్‌లు..** దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్‌లో మహిళల భద్రతను పెంపొందించడానికి శక్తి టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఈ టీమ్‌లలో 16 మంది మహిళా ఆర్‌పిఎఫ్ పోలీసులు ఉంటారన్నారు. మహిళా ప్రయాణికుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైల్వే ప్రయాణికుల్లో విశ్వాసాన్ని పెంపొందించేందుకు శక్తిటీమ్‌లు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటాయన్నారు.

## క్రీడాకారుల విజయం ఇతరులకు ఆదర్శం: చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: క్రీడాకారులు ఆత్మవిశ్వాసంతో పోటీలో పాల్గొని విజయం సాధించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని పర్యాటక శాఖ అభివృద్ధి చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. నాగోల్‌లోని స్కంద బ్యాడ్మింటన్ అకాడమీలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సమన్వ యంతో రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ స్టేట్ బ్యాడ్మింటన్ ఓపెన్ టోర్న మెంట్ అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల హాజరయ్యారు. ఈ సందర్భంగా పోటీలో గెలుపొందిన విజేతలకు ఉప్పల అవార్డులు అందజేసి శాలువాలతో సత్కరించారు. క్రీడాకారులకు ఆనందం, ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాలలో దూసుకుపోతున్నదని అన్నారు. మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి కారెడ్ల శ్రీనివాసరావు, కె.పాణిరావు, టోర్నమెంట్ కమిటీ సభ్యులు సూరి, సాయిరెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థులకు టిటిడిలో విష్ణుసహస్రనామ స్తోత్రాల పోటీలు



పోటీలో పాల్గొన్న విద్యార్థులు

సైఫాబాద్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: టిటిడి, హిందూ ధర్మప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో మాఘమాసం ను పు రస్కరించుకుని భీష్మా ఏకాదశిమి సందర్భంగా బుధవారం హిమాయత్‌నగర్‌లోని టిటిడి శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో విద్యార్థులకు శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్రాలు, అచ్యుతాష్టకం పోటీలు జరిగాయి. ఈ పోటీలలో వివిధ పాఠశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను నిర్వాహకులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిటిడి ఎఇఓ చతర్వేదుల సత్యనారాయణ, ఆర్గనైజర్ గూడూరు హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు మంజూరు చేయడంలేదు

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: జలమండలి విభాగంలో అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లుకు సకాలంలో బిల్లులను మంజూరు చేయడంలేదని కాంట్రాక్టర్ పోల్కం శ్రీనివాస్ ఆరోపించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా కాలయపాన చేస్తుందని వాపోయారు. బిల్లులను మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కెసిఆర్, ప్రిన్సిపల్ సెక్రటరీ శాంతకుమారి, జలమండలి డైరెక్టర్ దానకిషోర్, ఫైనాన్స్ సెక్రటరీకి, ఎస్సీ, ఎస్టి, బిసి వెల్ఫేర్‌శాఖకు వినతి పత్రాలను అందచేసినట్లు తెలిపారు. జలమండలి చీఫ్ జనరల్ మేనేజర్ సర్కిల్-1, జనరల్ మేనేజర్ డివిజన్-2 అధికారులు పనుల నాణ్యతపై రిపోర్ట్ అందచేసినట్లు తెలిపారు. క్వాలిటి కంట్రోల్, విజిలెన్స్ చేసిన పనులపై నివేదిక అందచేసినప్పటికి ఎందుకు చేసిన పనులకు బిల్లులు ఇవ్వడం లేదని వాపోతున్నారు. సకాలంలో బిల్లులు చెల్లించకుంటే ఖైరతాబాద్‌లోని జలమండలి డైరెక్టర్ కార్యాలయం ముందు నిరాహారదీక్ష చేపడుతానని తెలిపారు.

## కార్పొరేటర్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి

**మంత్రి హరీష్‌రావు**



పాఠశాల వసతుల ప్రారంభోత్సవంలో మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే కెపి వివేకానంద్

నిజాంపేట్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మన ఊరు-మన బడి కార్యక్రమంలో ప్రగతినగర్ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నిర్మించిన వసతులను బుధవారం ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భం గా మంత్రి మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలతో పోటీ పడే విధంగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలనే ఉద్దేశ్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు- మన బడి కార్యక్ర మాన్ని ప్రవేశపెట్టిందన్నారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికై ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. అదే విధంగా విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే విధంగా డిజిటల్ క్లాసులు ఏర్పాటు చేశామ ని, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో వసతులు కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, శ్రద్ధతో చదివి పాఠశాలలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాల న్నారు. అనంతరం ఎమ్మెల్యే కెపి వివేకానంద్ మాట్లాడుతూ బాచుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సుమారు 68లక్షల తో కాంపౌండ్ వాల్స్, త్రాగునీరు, విద్యుత్, వంటగది, టా యిలెట్స్, ఫర్నీచర్, గ్రీన్‌చాక్‌బోర్డు తదితర వసతులను కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ కమిషన్ దేవసేన, మేయర్ కొలన్ నీలా గోపాల్‌రెడ్డి, ప్రోగ్రాం అసిస్టెంట్ స్టేష్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమేష్, డీఈఓ విజయకుమారి, ఎంఈఓ ఆంజనేయులు, స్థానిక కమి షనర్ రామకృష్ణారావు, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, కార్పొరేటర్ ఇంద్రజిత్, ఫ్లోర్ లీడర్ ఆగంపాండు ముదిరాజ్, పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీనర్సిం హులు, ఎన్‌ఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

చార్మినార్, జనవరి 1 ప్రభాతవార్త : రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన పాతబస్తీ బహదూర్‌పుర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కిషన్‌బాగ్ ప్రాంతానికి చెందిన మహ్మద్ మొయినుద్దీన్ (74) బుధవారం మధ్యాహ్నం లూనాపై కిషన్‌బాగ్ నుంచి బహదూర్‌పుర వైపు వస్తున్నాడు. అదే సమయంలో అతి వేగంగా వెనుక నుంచి వచ్చిన టిప్పర్ లూనాను ఢీకొట్టింది. ఈ సంఘటనలో లూనాపై ప్రయాణం చేస్తున్న మహ్మద్ మొయినుద్దీన్ తీవ్ర గాయాల పాలై మృతి చెందాడు. ఈ కేసును బహదూర్‌పుర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## నేరాల నివారణలో తెలంగాణ పోలీసులు బేష్ : హోంమంత్రి



ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న హోంమంత్రి మహుమూద్‌అలీ, మంత్రి మల్లారెడ్డి, డిజిపి అంజనీకుమార్, ఎమ్మెల్యే బేతి తదితరులు

ఉప్పల్, ఫిబ్రవరి 1 ప్రభా తవార్త : నేరాల నివారణలో తెలంగాణ పోలీసులు అద్భుతంగా పని చేస్తున్నారని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహుమూద్‌అలీ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధ వారం ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నూతన భవన సముదాయాన్ని మంత్రి చామకూర మల్లా రెడ్డి, డిజిపి అంజనీకుమార్, రాచకొండ సిపి డిఎస్ చౌహాన్, ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ సురభివాణిదేవి, పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ తదితరులతో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో హోంమంత్రి మాట్లాడుతూ పోలీస్ శాఖ తమ బాధ్యతలు సక్రమంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని, సిసిటివిల నిర్వహణలో దేశంలోనే అగ్రస్థానంలో ఉందని, నేర దర్యాప్తులు, నేర నియంత్రణలో సిసి టివిలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నా యన్నారు. పోలీసులు రాత్రి, పగలు తమ విధులు నిర్వహిస్తూ ఆదర్శంగా ఉంటున్నా రన్నారు. కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థ సక్ర మంగా పనిచేయడం వల్ల రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని, నగరంలో ట్రాఫిక్ సమస్య లేకపోవడం వల్ల సాఫ్ట్‌వేర్ రంగం మరింత అభివృద్ధి చెందిందన్నారు. తెలంగాణ డిజిపి అంజనీకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతల నిర్వహనలో పోలీసులు నిబద్దతతో పనిచేస్తున్నారన్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ రాష్ట్రాన్ని ప్రశాంతంగా ఉండేందుకు తోడ్పాటు అందిస్తున్నారన్నారు. రాచకొండ సిపి డిఎస్ చౌహాన్ మాట్లాడుతూ విస్తీర్ణపరంగా దేశంలోనే రాచకొండ కమిషనరేట్ అగ్రస్థానంలో ఉందని, నేర నియంత్రణలో కూడా అగ్రస్థానంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపి అభిషేక్ మహంతి, ట్రాఫిక్ డిసిపి శ్రీనివాస్, మల్కాజిగిరి డిసిపి జానకి దరావత్, డిసిపి ఎల్‌బినగర్ సాయిశ్రీ, ఇందిర, నర్మద, షమీర్, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, పలువురు పోలీస్ అధికారులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## కొత్త సీసాలో పాతసారా లాగా కేంద్ర బడ్జెట్ ఉంది

**తెలంగాణ ఎన్జీఓ సంఘం పూర్వ అధ్యక్షుడు దేవిప్రసాద్**

చిక్కడపల్లి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి బడ్జెట్ పేద ప్రజల పొట్టకొట్టి అదాని, అంబానీలకు పంచే విధంగా ఉందని తెలంగాణ ఎన్జీఓ సంఘం పూర్వ అధ్యక్షుడు దేవిప్రసాద్ విమర్శించారు. కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ తీవ్ర నిరాశ పరిచిందని, ఉద్యోగులు, కార్మికుల డిమాండ్లను పక్కకు పెట్టి కేవలం రూ.7లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం నామమాత్రం మాత్రమే పెంచిన అధిక ధరల వల్ల పెరిగిన కరువు భత్యం ఇతర అలవెన్సుల వల్ల కనీసం రూ.10లక్షలకు పెంచాలనే డిమాండ్ పట్టించుకోకపోవం ఉద్యోగులను నిరాశపరిచిందని అన్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో బడుగు బలహీన వర్గాలకు అధిక ప్రాధాన్యత: కూన శ్రీశైలంగౌడ్

జీడిమెట్ల, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ బడుగు బలహీన వర్గాలకు, దేశ ప్రగతికి దోహదపడే విధంగా ఉందని మాజీ ఎమ్మెల్యే, బీజేపి రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం కూన సౌజన్య గార్డెన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపి రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలను అబివృద్ధికి పెద్ద పీట వేసిందని, ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆమోద యోగ్యంగా ఉందన్నారు. పేద ఇళ్ళ నిర్మాణానికి రూ.79వేల కోట్లు కేటాయించడం గొప్ప విషయమని, ఈ బడ్జెట్ పేద, మధ్య తరగతి, రైతుల ఆకాంక్షలను నెరవేరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ పాఠశాలను మరింత అభివృద్ధి పర్చడమే ప్రభుత్వ ధ్యేయం : మంత్రి తలసాని




పికెట్ ప్రభుత్వ పాఠశాలలో మనబస్తీ, మనబడి కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే సాయన్న

కంటోన్మెంట్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలలను అన్ని రకాల సౌకర్యాలు, వసతులు కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమలు, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మన బస్తీ, మనబడి కార్యక్రమంలో భాగంగా బుధవారం కంటోన్మెంట్ 4వ వార్డు పికెట్ ప్రభుత్వ పాఠశాలలో రూ.36.28 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన పాఠశాల భవనాన్ని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే జి.సాయన్న, మెడికల్ ఇన్‌ఫ్రస్ట్రక్చర్ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బేవరేజెస్ చైర్మన్ గజ్జల నాగేశ్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తలసాని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యా, బోధన అందిస్తున్న ఏకైక ప్రభుత్వమన్నారు. విద్యార్థులు ప్రైవే ట్ స్కూళ్లకు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే విధంగా పాఠశాలలో విద్యార్థులకు సకల సౌకర్యాలు మెరుగుపరుస్తున్నామన్నారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లోని తరగతి గదులు, టాయిలెట్స్, ఫర్నీచర్, పాఠశాలల భవనానికి పెయింటింగ్, మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తు న్నామ న్నారు. తెలంగాణ వచ్చిన తరువాతనే గురుకుల, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించడంతో మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. విదేశాల్లో ఉన్నత విద్య కోసం వెళ్లే విద్యార్థులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వపాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. ఈకార్యక్రమలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, మాజీ బోర్డు సభ్యులు నళిని కిరణ్, పాండు యాదవ్, ప్రభాకర్, బిఆర్ఎస్ నేతలు నర్సింహ్మా ముదిరాజ్, సంతోష్ యాదవ్, పెద్దాల నర్సింహ్మా, దాసరి కర్ణకుమార్, ఉప విద్యాశాఖ అధికారి బాలునాయక్ పాల్గొన్నారు.

## కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా

చిక్కడపల్లి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డులో కాంట్రాక్టర్లకు లంచం ఇవ్వలేదనే పేరుతో తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధులోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసిక్రాస్‌రోడ్స్ కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ముందు సిఐటియు గ్రేటర్‌హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పెద్దఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అన్యాయంగా తొలగించిన 23 మంది కాంట్రాక్ట్ కార్మికులను డ్యూటీలోకి పెట్టించాలని, లంచం అడిగిన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని, కాంట్రాక్ట్ కార్మికులకు చట్టపర సౌకర్యాలు అమలు జరిగేలా చూడాలని కోరారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సిఐటియు నగర నాయకులు జి.కిరణ్, కార్యదర్శి ఎం.వెంకటేశ్ పాల్గొన్నారు.

## ఘనంగా సీతారాములు కల్యాణోత్సవం



స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

అల్వాల్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: దేవుని అల్వాల్‌లో శ్రీ సీతా రాముల కళ్యాణోత్సవం ఘనంగా జరిగింది. శ్రీ సీతారామ నామ సంకీర్తన సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులుగా సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి వారి వార్షికోత్సవాలు సాగుతున్నాయి. ఇందులో భాగంగా సీతారాముల కళ్యాణోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యులు సుదర్శన్ రెడ్డి పరాంకుశం మాధవ్ శ్రీనివాస్ రావు రామచంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భీష్మా ఏకాదశిమి వేడుకలు



భీష్మా ఏకాదశిమి వేడుకల్లో పాల్గొన్నా కాలేరు వెంకటేష్

హైదరాబాద్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: భీష్మా ఏకాదశిమి సందర్భంగా అంబర్‌పేట గంగ తెప్పోత్సవ కమిటి ఆధ్వర్యంలో బుధవారం గోల్నాక డివిజన్‌లోని శివాలయంలో 'భీష్మా ఏకాదశిమి' వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో గంగపుత్రుల ఆత్మీయ సమ్మేళనం కూడా జరిగింది. ఈ సమ్మేళనంలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అలాగే కార్పోరేటర్లు దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర నాయకులు గులాబ్ శ్రీనివాస్, మీట్టు ధనరాజ్, గడ్డం సాయికిరణ్, శ్యాంసుందర్, మైలారం రాజు, అంకర్ల యశ్వంత్, శ్రీనివాస్, యాదగిరి, యాదగిరి, స్వరూప, గంగపుత్ర కుల సంఘం సభ్యులు, గంగపుత్రుల యువకులు తదితరులు పాల్గొన్నారు.

## గుజరాత్ అల్లర్లపై బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీ ప్రదర్శనను అడ్డుకున్న పోలీసులు



గుజరాత్ అల్లర్లపై బీబీసీ తీసిన డాక్యుమెంటరినీ విడుదల చేసేందుకు యత్నిస్తున్న టీఆర్ఎస్వీ నాయకులు

తార్నాక, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: ఉస్మానియా యూనివర్సిటీలో టీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో గుజరాత్ అల్లర్లపై బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీ ప్రదర్శన ఏర్పాట్లను ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు అడ్డుకున్నారు. ఆర్ట్స్ కాలేజ్ వద్ద బుధవారం సాయంత్రం డాక్యుమెంటరీ ప్రదర్శన సేందుకు టీఆర్ఎస్వీ నాయకులు ఏర్పాట్లు చేస్తుండగా విషయం తెలుసుకున్న పోలీసులు టీఆర్ఎస్వీ విధ్యార్థి నాయకులు పెద్దమ్మ రమేష్‌తో పాటు పలువురిని ఇన్స్‌పెక్టర్ రమేష్ నాయక్ అదుపులోకి తీసుకొని ఓ.యూ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పెద్దమ్మ రమేష్ మాట్లాడుతూ బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీపై విధించిన నిషేదాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శులు జీడీ అనిల్, రాజేష్ నాయక్, కునపురం శశిపాల్, నాగేందర్ రావు, అవినాష్, మధుగౌడ్, అనిల్, రాజు, నాగరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ ఎక్సలెన్స్ అవార్డు ప్రధానం



ఎన్టీఆర్ ఎక్సలెన్స్ అవార్డును అందుకుంటున్న టీడీపీ రాష్ట్ర దళిత విభాగం ప్రధాన కార్యదర్శి రాఘువులు

నార్సింగి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : ప్రతిష్టాత్మకమైన ఎన్టీఆర్ ఎక్సలెన్స్ అవార్డును గండిపేట్ మండలానికి చెందిన టీడీపీ రాష్ట్ర దళిత విభాగం ప్రధాన కార్యదర్శి రాఘువులుకు అందజేశారు. ప్రతీ ఏటా ఈ అవార్డును కళా నియలం ద్వారా పంపిణీ చేస్తు, వివిధ విభాగాలలో సేవలు అందిస్తున్న వారికి అందించి, అభినందిస్తుంటారు. 1983.నుంచి ఇప్పటి వరకు టీడీపీ పార్టీ అభ్యున్నతికి అహర్నిష్టలు కష్టపడుతున్న గూడెపు రాఘువులుకు ఈ సారి ఎన్టీఆర్ ఎక్సలెన్స్ అవార్డును అందించి అభినందించారు. సాధారణ కార్యకర్త స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్ర టిడిపి దళిత విభాగం ప్రధాన కార్యదర్శిగా సమర్థవంతంగా తన బాధ్యతలు నెరవేరుస్తున్న రాఘవులుకు ఈ అవార్డు రావడం పట్ల గంధంగూడకు చెందిన పుర ప్రముఖులు, గండిపేట్ మండల టీడీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాఘువులు మాట్లాడుతూ ఈ అవార్డు నా బాధ్యతను మరింత పెంచిందన్నారు. తనకు టీడీపీ అధిష్టానం అందించిన ప్రతీ బాధ్యతను సమర్థవంతంగా, అంకిత భావంతో పూర్తి చేశానని, ఇక ముందు కూడా చేస్తూనే ఉంటానని తెలిపారు.

## కాంట్రాక్ట్ కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి : పిడమర్తి రవి

కంటోన్మెంట్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డులో కాంట్రాక్ట్ కార్మికునిగా విధులు నిర్వహిస్తూ విధి నిర్వాహనలో ప్రమాదవశాత్తూ నాలనాలో పడి మృతి చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు ఎల్లేష్ అంత్యక్రియలు బుధవారం మచ్చబొల్లారంలో జరిగాయి. విషయం తెలుసుకున్న ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అంతిమ యాత్రలో పాల్గొని మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

## కెసిఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారు: మంత్రి తలసాని

ఖైరతాబాద్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి కెసిఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని, ఈ నేపథ్యంలోనే మన ఊరు, మన బడి, మన బస్తీ వంటి కార్యక్రమంలో విద్యార్థుల భవిష్యత్తుకు, సకల సౌకర్యాలకు సంకల్పిస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం ఖైరతాబాద్ నియోజక వర్గం పరిధిలోని ప్రభుత్వ పాఠశాల కార్యక్రమానికి మంత్రి తలసాని ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రధానంగా పరిశుభ్రమైన తాగునీరు, డైనింగ్ హాల్స్, సోలార్ ప్యానెలు, డిజిటల్ తరగతులు, పచ్చని పరిసరాలు, గ్రీన్ చాక్ బోర్డులు, లైటింగ్ సిస్టమ్, టాయిలెట్లు అవసరమైతే అదనపు తరగతి గదులు, కాంపౌండ్ వాల్, పాఠశాలల భవనాల మరమత్తు, కిచెన్, షెడ్స్ రంగులు, తదితర వంటివి 12 రకాల వసతులకు ముఖ్యమంత్రి కెసిఆర్ శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. అదేవిధంగా విద్యార్థులు మంచి భవిష్యత్తు కోసం అన్ని రంగాల్లో రాణించాలని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి, ఎమ్మెల్యే దానం నాగేందర్, చైర్మన్, గజ్జెల నాగేశ్వర్ రావు, కార్పొరేటర్ పి.విజయారెడ్డి, డిప్యూటీ మేయర్ గ్రంథాలయ చైర్మన్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అంతకుముందు ముఖ్యఅతిథి, ప్రజాప్రతినిధులకు ఘనస్వాగతం లభించింది.

## వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలి

**తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి అయిలమల్లు**



ధర్నాలో నినాదాలు చేస్తున్న వడ్డెర సంఘం నాయకులు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త: వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి అయిలమల్లు డిమాండ్ చేశారు. బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాన వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేసించి అయిలమల్లు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినప్పటికీ వడ్డెర్ల బతుకులలో ఎలాంటి మార్పూ రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడితే వడ్డెర్లకు న్యాయం జరుగుతుందని, తెలంగాణ ఉద్యమంలో పాల్గొని, పోరాడి, రాష్ట్రం సాధించుకుని ఎనిమిది సంవత్సరాలు అయినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం వడ్డెర్లకు న్యాయం చేయలేదని ఆరోపించారు. మహబూబ్‌నగర్ ఎంపీ గా ఉన్నప్పుడు వడ్డెర్లను ఎస్టీలో చేర్చాలని మద్దతు ఇచ్చిన కేసీఆర్, ఉద్యమ సమయంలో కూడా తాము అధికారంలోకి వస్తే వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేరుస్తామని హామీ ఇచ్చి, మర్చిపోయారని అన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో వడ్డెర సంఘం వైస్ చైర్మన్ వంటిపులి శ్రీనివాస్, నాయకులు పల్లపు నారాయణ, ఒల్లెపు సాయికుమార్, మంజుల నగేష్, గండికోట కుమార్, వరికుప్పల ముత్యాలు పాల్గొనగా, వివిధ సంఘాల వడ్డెర నాయకులు, వివిధ జిల్లాల అధ్యక్షులు, మండల కమిటీ నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు.

## మీ సమస్య మా పోరాటంతో ప్రజా సమస్యలకు చెక్

**బిజెపినేత గజ్జల యోగానంద్**



సమస్యలను పరిశీలిస్తున్న యోగానంద్

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త : శేరిలింగంపల్లి నియోజక వర్గం పరిధిలోని ఆల్విన్ కాలనీ డివిజన్‌లో ప్రజా సమస్యలపై 10వ రోజు శేరిలింగంపల్లి బిజెపి ఇంచార్జ్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే గజ్జల యోగానంద్ బుధవారం పాదయాత్ర నిర్వహించారు. ఆల్విన్‌కాలనీ బస్ స్టాప్ వద్ద బిజెపి జెండాను ఆవిష్కరించి అనంతరం ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు వెంకట పాపయ్య నగర్ వరకు యోగానంద్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. స్థానికంగా నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి కార్పొరేటర్‌కు పలుమార్లు తెలియపరచినా వారు స్పందించకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో సొంత ఖర్చులతో డ్రైనేజి వ్యవస్థను బాగుచేసుకున్నామని స్థానికులు తెలియజేశారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారినికి తలపెట్టిన మీ సమస్య మా పోరాటం ద్వారా ఈ సమస్యలపై పోరాడి త్వరలోనే ప్రజలకు విముక్తి కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సురభి రవీందర్, రామరాజు, విజితవర్మ, స్రవంతి, టప్పు రఘు, పాలష్, బీపుల్, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కంటి వెలుగుకు మంచి స్పందన



అడిక్‌మెట్‌లో ఏర్పాటుచేసిన శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ మహేందర్

హైదరాబాద్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు పథకానికి ముషీరాబాద్ నియోజకవర్గంలో ప్రజల నుంచి మంచి స్పందన ఉందని నోడల్ అధికారి డాక్టర్ పద్మజ తెలిపారు. ఈ కార్యక్రమం ప్రారంభమై పది రోజులైందన్నారు. నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో 8 క్యాంపులు కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రతి రోజు ఒక్కో క్యాంపులో 100 నుంచి 120 మంది ఎన్‌రోల్ చేసుకుని కంటి పరీక్షలు చేయించుకుంటున్నారని తెలిపారు. ఇప్పటివరకు 7,800 మందికిపైగా వైద్యపరీక్షలు నిర్వహించామని వివరించారు. వీరిలో 2,919 మందికిపైగా కంటి అద్దాలు పంపిణీ చేయడం జరిగిందని చెప్పారు. మరో 1100 మందికి వారి దృష్టి ప్రకారం కంటి అద్దాల కు ఆర్డర్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. అవి రాగానే వారి ఇంటివద్దకు వెళ్లి అందజే స్తామన్నారు. శస్త్రచికిత్సలు అవసరం ఉన్నవారి పేర్లను నమోదు చేసుకుని ఆపరేషన్ కోసం తేదీలను ప్రకటిస్తామని చెప్పారు. ప్రతిఒక్కరూ కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

### మరణించిన తోటి ఉద్యోగి కుటుంబానికి బాసటగా..

## అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నాన్‌టీచింగ్ ఎంప్లాయిస్

హైదరాబాద్, ఫిబ్రవరి 1,ప్రభాతవార్త: అనారోగ్యంతో మరణించిన తోటి ఉద్యోగి కుటుంబానికి బాసటగా నిలిచింది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నాన్‌టీచింగ్ ఎంప్లాయిస్ యూనియన్. విశ్వవిద్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ యూనియన్ మాజీ కోశాధికారి ఇ.సుధాకర్ కొంతకాలం క్రిందట అనారోగ్యంతో మరణించాడు. దీంతో అతని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని యూనియన్ అధ్యక్షులు మహేశ్వర్‌గౌడ్ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.సీతారామరావు ,రిజిస్ట్రార్ అచార్య వెంకట నరసింహారెడ్డి, డిప్యూటీ రిజిస్ట్రార్ భవాని చంద్రశేఖర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.బ్రహ్మానంద నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సుధాకర్ కుమారుడు సాగర్‌కు కాంపాషినేట్ గ్రౌండ్స్ కింద ఆఫీస్ సబార్డినేట్‌గా ఉద్యోగం ఇప్పించారు. ఈమేరకు బుధవారం అపాయింట్‌మెంట్ ఆర్డర్‌ను రిజిస్ట్రార్ చేతుల మీదుగా సాగర్‌కు అందజేశారు. ఈసందర్భంగా విధుల్లో ఉండి అనారోగ్యంతో మరణించిన ఉద్యోగి కుమారుడికి ఉద్యోగం కల్పించడం పట్ల యూనియన్ అధ్యక్షులు మహేశ్వర్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. వైస్ చాన్స్‌లర్ ,రిజిస్ట్రార్ ,పరిపాలన విభాగం ఉన్నతాధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మార్కేండయ శర్మ, ఉపాధ్యక్షురాలు భూలక్ష్మీ, సంయుక్తకార్యదర్శి పాండు, కోశాధికారి పిచ్చయ్య, విశ్వనాథ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## దేశంలోనే అరుదైన వేణువాద కళాకారిణి జయప్రద రామమూర్తి

**దూరదర్శన్ పూర్వ సంచాలకులు డాక్టర్ పాలకుర్తి మధుసూదన్‌రావు**

చిక్కడపల్లి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: దేశంలోనే మహిళల్లో అరుదైన వేణువాద కళాకారిణి దక్షిణభారతంలో ఏకైక కళాకారిణి జయప్రద రామమూర్తి అని దూరదర్శన్ పూర్వ సంచాలకులు డాక్టర్ పాలకుర్తి మధుసూదన్‌రావు కొనియాడారు. రాగరాగిణి సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మొదటి మహిళా వేణువాద్య విద్వాంసురాలు డాక్టర్ జయప్రద రామ్మూర్తిచే అన్నమయ్య కీర్తనల వేణు వాదద్యకచేరీ కార్యక్రమం బుధవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో నిర్వాహక సంస్థ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎం.వి.రమణకుమారి, ఎం.వి.సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా డాక్టర్ పాలకుర్తి మధుసూదన్‌రావు హాజరై జయప్రద రామ్మూర్తిని సత్కరించారు.

## మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

**పశుసంవర్ధక శాఖ ఆవరణలో రూ.25 లక్షలతో ఫిష్ క్యాంటిన్ ప్రారంభం**



ఫిష్ క్యాంటిన్‌ను ప్రారంబిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

మెహిదీపట్నం, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త : మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, వివిధ రకాల చేపల వంటకాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం మాసబ్ ట్యాంక్‌లోని మత్స్యశాఖ కార్యాలయ ఆవరణలో రూ.25 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిష్ క్యాంటీన్ ప్రారంబోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్యాంటీన్‌ను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో చేపల వినియోగాన్ని పెంచేందుకు, చేపల వంటకాలపై మహిళలకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. రాష్ట్రం ఏర్పడిన తరవాత ప్రారంభించిన ఉచిత చేప పిల్లల పంపిణీతో మత్స్య సంపద గణనీయంగా పెరిగిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఈ రంగానికి తగిన ఆదరణ లేదని, తెలంగాణ ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవతో గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. పెరిగిన మత్స్య సంపదను మత్స్య కారులు విక్రయించుకోవడానికి గాను సబ్సిడీపై వివిధ రకాల వాహానాలను అందజేయడం జరిగిందన్నారు. అంతే కాకుండా చేపలు, చేపల వంటకాల విక్రయాల కోసం సబ్సిడీపై మొబైల్ రిటైల్ ఫిష్ ఔట్ లేట్‌లను కూడా అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అధర్ సిన్హా, మత్స్య శాఖ కమిషనర్ లచ్చిరాం భూక్యా, పశుసం వర్ధక శాఖ డైరెక్టర్ రాంచందర్, అధికారులు మంజువాణి, శ్రీనివాస్ మురళీకృష్ణ, లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదాయం పెంచకుండానే పెరిగిందని ప్రకటించడం దారుణం

సైఫాబాద్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా అంకెల గారడియేనని లోక్‌దళ్ పార్టీ జాతీయ కార్య దర్శి పి. వెంకటరాజేశ్వర్‌రావు ఆరోపించారు. లక్షల కోట్ల రూపా యలు అప్పులు తెచ్చి ఇదంతా అభివృద్ధియేనని ప్రకటించడం, ఆదాయం పెంచకుండా పెరిగిందని ప్రకటించడం దారుణమని ఆయన విమర్శించారు. కార్పోరేట్ సంస్థలకు ఎర్ర తివాచీలు పరుస్తూ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ చర్యలు చేపట్టడం దోపిడీ దొంగలకు తాళాలు చేతికివ్వడమేనని ఆయన ధ్వజమెత్తారు. బడ్జెట్ వాస్తవికంగా ఉండాలే తప్పా అంకెల గారడి చేస్తూ మాయ మాటలతో ప్రజలను మోసం చేయరాదని ఆయన హెచ్చరించారు.

## ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు



స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త : కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ కాలనీలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర ఆలయంలో టిటిడి అడ్వైజర్ కమిటీ సభ్యులు, బిజెపి సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడి ఆలయం యొక్క 18వ వార్షికోత్సవంలో భాగంగా ఆలయ కమిటీ సభ్యుల పిలుపుమేరకు మహావార్షికోత్సవ కార్యక్రమంలో బిజెపి నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు స్వామి వారి పూజలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి ఆలయ కమిటీ చైర్మన్‌రావు, కాలనీ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, ఆలయ కమిటీ సెక్రటరీ జైహింద్, గోవింద్, రామయ్య, రఘునందన్, శేషయ్య, రవికుమార్ ఇతర సభ్యులు కలిసి ఈ సంవత్సరం వార్షికోత్సవంలో వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొనడం సంతోషంగా ఉందని తెలియజేస్తూ వారిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అనంత నాగరాజు, దిలీప్‌కుమార్, మహేష్‌గౌడ్, రామ్మోహన్‌రావు, వందన స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడి పూజలో పాల్గొనాలని ఎమ్మెల్సీకి ఆహ్వానం



ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుతో శివస్వాములు

జీడిమెట్ల, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి గాజులరామారం నల్లగుట్టపై ఉన్న శ్రీ భ్రమరాంభ మల్లిఖార్జునస్వామి దేవస్థానం కమిటీ సభ్యులు బుధవారం మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు,ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దూదిమెట్ల సోమేష్ యాదవ్ ఈనెల 5న ఆలయ ప్రాంగణంలో నిర్వహించే ద్వాదశ జ్యోతిర్లింగ శివ మహాపడి పూజకు రావాలని ఎమ్మెల్సీకి ఆహ్వాన పత్రికను అందజేశారు.అనంతరం మ్మెల్సీ గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, సురేష్‌రెడ్డి, నాయకులు ఎత్తరిమార య్య, కృష్ణ యాదవ్, శివస్వాములు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## గల్లీలను పరిశుభ్రంగా ఉంచాలి



ఎస్‌ఎఫ్‌ఈలతో మాట్లాడుతున్న మహాలక్ష్మీరామన్‌గౌడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: గల్లీలను పరిశుభ్రంగా ఉంచాలని తద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవచ్చునని హిమాయత్‌నగర్ డివిజన్ కార్పోరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్ చెప్పారు. ఈ మేరకు బుధవారం తన క్యాంప్ కార్యాలయంలో డివిజన్‌కు సంబంధించిన ఎస్‌ఎఫ్‌ఈలతో ఆమె సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లోని ప్రతి గల్లీలో చెత్తాచెదారాన్ని ఎత్తివేసి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. లేకపోతే దోమలు, ఇతర క్రిమిసంహారిక పురుగులు చేరి ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రామన్‌గౌడ్, నర్సింగ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి వినతి పత్రం అందచేస్తున్న బిఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గం నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్, ఈ కార్యక్రమంలో జోసెఫ్,బాస్కర్,డాలి

## రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బట్టు శ్రీధర్

సైఫాబాద్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6వ తేదీన బడ్జెట్‌లో ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో విద్యకు 30శాతం నిధులు కేటాయించాలని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానాన్ని రద్దు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని భారతీయ విద్యా మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బట్టు శ్రీధర్ డిమాండ్ చేశారు. బుధవారం బషీర్‌బాగ్‌లో మోర్చా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శతాబ్దం పూర్తి చేసుకున్న చారిత్రాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం అభివృద్ధికి 1000 కోట్లు కేటాయించాలని, అలాగే తెలంగాణ విశ్వవిద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయం, పాలమూరు విశ్వవిద్యాలయం తదితర విశ్వవిద్యాలయాల అభవృద్ధికి మరో 1000 కోట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 3500 స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని, నారాయణ, శ్రీచైతన్య లాంటి కార్పోరేట్ విద్యా సంస్థలను తక్షణమే రద్దు చేయాలని ఆయన కోరారు. పై డిమాండ్లపై తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రంలో ప్రజా ప్రతినిధులను నియోజకవర్గాల్లో తిరగనీయబోమని ఆయన హెచ్చరించారు.

## అరుంధతినగర్‌లో కార్పొరేటర్ పాదయాత్ర



నాలా పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావనీ వినయ్‌కుమార్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్లఓని అరుంధతి నగర్‌లో కొనసాగుతున్న నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణం జరుగుతున్న ప్రాంతాన్ని స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్ వివిధ శాఖ అధికారులు, సిబ్బందితో కలిసి బుధవారం పరిశీలించారు. వాటర్‌వర్క్స్ మేనేజర్ కృష్ణమోహన్, జిహెచ్ఎంసి డీఈఈ సన్నీ, ఇరిగేషన్ ఏఈ శ్యామ్‌సుందర్‌లతో కలిసి ఆ ప్రాంతాన్ని సందర్శించి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. నాలా రిటైనింగ్ వాల్ పరిసర ప్రాంతంలో వెంటనే సీవరేజ్, కచ్చా నాలా సరఫరాను అశోక్‌నగర్ నాలాను క్రమబద్ధీకరించాలని సూచించారు. రెండు రోజుల్లో సీవరేజ్ సమస్యను పరిష్కరించి పనులు చేపడుతామని అధికారులఉ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నగర నాయకుడు ఎ.వినయ్‌కుమార్, బిజెపి ఓబీసీ మోర్చ ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ ఎం.ఉమేశ్, ఆకుల సురేందర్, నర్సింహ, స్థానిక బస్తీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సర్కారు బడుల్లో కార్పొరేట్ విద్య: ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



గండిపేటలో మనబస్తీ - మన బడి కార్యక్రమంలో పాల్గొన్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రంలోని అన్ని సర్కారు బడుల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు కార్పోరేట్ స్థాయి విద్యను అందించేందుకు సీఎం కేసీఆర్ మనబస్తీ - మన బడి పతకంను అమలు చేస్తున్నారని రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం గండిపేట్‌లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల మనబస్తీ - మనబడి కార్యక్రమాన్ని నార్సింగి చైర్ పర్సన్ దారుగుపల్లి రేఖ యాదగిరితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కారు బడుల్లో మౌళిక వసతుల కల్పనకు ఏటా రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతుందన్నారు. కరెంటు, నీటి సౌకర్యం, ముగుదొడ్లు, ప్రహారీగోడ, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయం వంటి సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. విద్యతోనే మనుషులు ఉన్న స్థానం నుంచి ఉన్నత స్థానానికి చేరుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సత్య ప్రకాశ్, వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్, కౌన్సిలర్లు సునీత గణేష్, విజిత ప్రశాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

సైఫాబాద్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: జీఆర్ఈ, టోఫెల్ ఆన్లైన్ ఎంట్రన్స్ పరీక్షలకు సంబంధించి మాల్ ప్రాక్టీస్‌లకు పాల్పడుతున్న వారిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈమేరకు బుధవారం ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర ఆధ్వర్యంలో ఒక ప్రతినిధి బృందం హైదరాబాద్ సైబర్ క్రైమ్ అసిస్టెంట్ కమిషనర్ కె.వి.ఎం.ప్రసాద్‌కు వినతి పత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ ఈ ఎంట్రన్స్ పరీక్షలను ఆన్లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్ ద్వారా నిర్వహించాలని, ఈ ఎడ్యు కేషనల్ టెస్టింగ్ సర్వీస్‌ను సాంకేతిక విద్యామండలి పరిధిలోకి తీసుకురావాలని కోరా రు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలకు టోఫెల్, జీఆర్ ఈ పరీక్షలు కీలకపాత్ర పోషిస్తున్నాయని, వాటిలో ఎంట్రన్స్ ద్వారా సాధించే స్కోర్ ఆధారంగానే సీటు, ఉపకార వేతనాలు ఆదారపడి ఉంటాయన్నారు. ఈ కార్యక్ర మంలో ఎఐవైఎఫ్ నాయకులు నేర్లకంటి శ్రీకాంత్, కళ్యాణ్, రాకేష్ పాల్గొన్నారు.

## ఉద్యోగుల ఐక్యతతో సంక్షేమ కార్యక్రమాల నిర్వహణ



సిటి డైరీ అవిష్కరిస్తున్న ఎం.రాజేందర్,ప్రతాప్,శ్రీరామ్, ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీలు

గన్‌ఫౌండ్రి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: టిఎన్‌జిఓ యూనియన్,హైదరాబాద్ సిటి అధ్యక్షులు శ్రీరామ్, కార్యదర్శి శ్రీకాంత్ ఆధ్వ ర్యంలో రూపొందించిన 2023 సిటి డైరీని తెలంగాణ నాన్‌గజిటెడ్ రాష్ట్ర అధ్యక్షులు మామిళ్ల రాజేందర్, కార్యదర్శి ఆర్.ప్రతాప్, జిల్లా అధ్యక్షులు ఎస్.ఎం.ముజీబ్ హుస్సే నీలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ ఉద్యోగుల ఐక్యమత్యం ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమ న్నారు. కస్తూరి వెంకటేశ్వ ర్లు, గచ్చిబౌలి హౌజింగ్ సొసైటి సత్యనారాయణ, శ్రీనివాస్‌గౌడ్, కొండల అంజి, గోవర్ధన్, ఉమాదేవి, శైలజ, చంద్రశేఖర్, విఠల్, బాల్‌రాజ్, వినోద్, అనిత, సత్యమూర్తి, నవీన్,లక్ష్మి,సలావుద్దీన్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్

**షాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :**
అంగన్‌వాడీలను ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్ తెలిపారు. బుధవారం షాబాద్‌లో అంగన్‌వాడీ టీచర్లతో సమావేశంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... రాష్ట్రంలో గత 40 సంవత్సరాల నుండి ఐసీడీఎస్‌లో 70వేల మంది అంగన్‌వాడీ టీచర్లు పనిచేస్తున్నారని వారికి ఉద్యోగ భద్రత లేదని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు లేవని, రిటైర్మెంట్ బెనిఫిట్, పెన్షన్ సౌకర్యాలు లేవని ఇలాంటి అనేక సమస్యలతో అంగన్‌వాడీలు కొట్టుమిట్టులాడుతున్నారని ప్రభుత్వం మార్చిలోగా సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో మార్చిలో రాష్ట్రవ్యాప్త సమ్మె నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు తదితరులు ఉన్నారు.

## ముగిసిన అయ్యవారిగూడ ప్రీమియర్ లీగ్ పోటీలు



అయ్యవారిగూడ ప్రీమియర్ లీగ్ పోటీలో గెలుపొందిన టీమ్

**యాచారం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త**
మండల పరిధిలోని అయ్యవారిగూడెం గ్రామంలో గత మూడు రోజులుగా గ్రామ సర్పంచ్ నేనావత్ గంగా లచ్చిరాంనాయక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అయ్యవారిగూడ ప్రీమియర్ లీగ్ పోటీలు బుధవారం ముగిశాయి. గ్రామానికి చెందిన నాలుగు క్రికెట్ టీమ్‌లు పోటీ పడగా గ్రామానికి చెందిన ఇండియన్ టీం ప్రథమ బహుమతి రూ. 20116, రాయల్ ఛాలెంజర్స్ టీం ద్వితీయ బహుమతి రూ. 15116ను గెలుపొందాయి. ఈ టోర్నమెంట్‌లో ఆర్గనైజర్స్ నరసింహ, శ్రీనివాస్, కరుణాకర్‌రెడ్డి, వెంకటేష్, రామకృష్ణయాదవ్, మండలి గోపాల్, వనం కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటుకు దీటుగా సర్కారీ పాఠశాలల అభివృద్ధి

### -భవనాల పనుల పరిశీలన



ఘట్‌కేసర్ జడ్పీహైస్కూల్‌లో పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ పావనియాదవ్, వైస్‌చైర్మన్ మాధవరెడ్డి

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:**
ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్‌లోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న మనబస్తీ-మనబడి కార్యక్రమం పనులను బుధవారం ఆమె వైస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డితో కలిసి పరిశీలించారు. మున్సిపాలిటీలోని 7 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించేవిధంగా ప్రభుత్వం నిధులు కేటాయించి పనులు చేపట్టిందన్నారు. రెండు పాఠశాలల్లో శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలగించి నూతన తరగతి గదుల నిర్మాణం చేపట్టడంతో ఆమె నిర్మాణ పనులను పరిశీలించి ప్రగతిపై ఆరా తీశారు. మంత్రి మల్లారెడ్డి సహకారంతో మున్సిపల్‌లో ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆమె తెలిపారు. పాఠశాల పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని చైర్‌పర్సన్ కాంట్రాక్టర్ కందకట్ల మాధవరెడ్డికి సూచించారు. ప్రధానోపాధ్యాయులు కె.పాపిరెడ్డి, అనిత, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రాకేశ్, మాజీ వార్డుసభ్యులు ఎండి.రహీముద్దీన్ తదితరులు ఉన్నారు.

## దేవాలయ నిర్మాణానికి స్వాతిగౌడ్ విరాళం



మహంకాళీ దేవాలయ నిర్మాణానికి చందా అందజేస్తున్న వార్డుసభ్యురాలు స్వాతి వేగానంద్‌గౌడ్

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ అనుబంధ గ్రామం మక్తాలో నూతనంగా నిర్మించనున్న మహంకాళీ అమ్మవారి దేవాలయానికి 5వ వార్డుసభ్యురాలు కుర్ర స్వాతి వేగానంద్‌గౌడ్ రూ.50 వేలు విరాళంగా అందజేశారు. గ్రామంలో నిర్మించ తలపెట్టిన అమ్మవారి దేవాలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామని దాతలు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. ఆలయ కమిటీ నాయకులు బైరు పాండుగౌడ్, ముంత జంగయ్య, చింతపంటి రాములు వార్డుసభ్యురాలు నివాసానికి రాగా వారి ఆమె విరాళం అందజేశారు.

## సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో సత్తా చాటిన మరికల్ విద్యార్థులు

**చౌడాపూర్ ఫిబ్రవరి 1,ప్రభాతవార్త :** కేరళ రాష్ట్ర,త్రిశూర్ పట్టణంలో నిర్వహించిన సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో భాగంగా జనవరి27 నుంచి 31 వరకు జరిగిన ప్రదర్శనలో తెలంగాణ రాష్ట్ర తరపున పాల్గొన్న మండల పరిధిలోని మరికల్ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రామ్ చరణ్ మరియు శివ సాయి పాల్గొని, సైన్సు ఉపాధ్యాయుడు జి.రవి కుమార్ సహకారంతో కాలుష్యం మరియు ఇంధన వనరుల ధరల పెరుగుదల= ప్రత్యామ్నాయంగా నీటిని ఇందనంగా కూడా వాడవచ్చని నిరూపించారు.సైన్స్ ఫెయిర్‌లో పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచి ద్వితీయ బహుమతిని కేరళ ప్రముఖులు జీవన్ బాబు,మరియు శివం కుట్టి మంత్రుల చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.బహుమతి పొందిన విద్యార్థులను,సహకరించిన ఉపాధ్యాయుడు రవి కుమార్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి మరియు ఉపాధ్యాయులు బృందం అభినందించారు.మార్చిలో జరిగే జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో కూడా విద్యార్థులు పాల్గొంటారని సరస్వతి తెలిపింది.



# కెసిఆర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

### -టోర్నీలో తాండూరు నియోజకవర్గం వ్యాప్తంగా పాల్గొన్న క్రీడాకారులు
### -గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే టోర్నమెంట్ నిర్వహణ : శుభప్రద్ పటేల్



**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**
యువత క్రీడల్లో రాణించి మంచి పేరు తెచ్చుకోవాలని రాష్ట్ర బిసి కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్ అన్నారు.యాలాల మండలం లక్ష్మీనారాయణ పూర్ సహారా గ్రౌండ్‌లో సిఎం కెసిఆర్ జన్మదినం సందర్భంగా శుభప్రద్ పటేల్ యువసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కెసిఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను జడ్పివైస్ చైర్మన్ విజయ్ కుమార్‌తో కలిసి శుభప్రద్ పటేల్ లాంఛనంగా ప్రారంభించారు.ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకొని టోర్నమెంట్‌లో పాల్గొన్న ఇరు జట్లకు టాస్ వేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా శుభప్రద్ పటేల్ క్రికెట్ ఆడి సందడి చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ..క్రీడలతో మంచి స్నేహ బంధాలు ఏర్పడడంతో పాటు మానసిక ఉల్లాసం శారీరక దారుఢ్యం పెంపొందుతుందని తెలిపారు.ఆటల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు.గ్రామీణ క్రీడాకారులను వెలికితీసేందుకు ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు శుభప్రద్ పటేల్ చెప్పారు.అటు జడ్పివైస్ చైర్మన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ..సిఎం కెసిఆర్ పుట్టిన రోజు సందర్భంగా కెసిఆర్ క్రికెట్ ట్రోఫీ నిర్వహించడం చాలా సంతోషకరమన్నారు.క్రీడాకారులు ఆటలో మంచి క్రమశిక్షణతో ఆడి మంచి ప్రతిభ కనబర్చాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పెద్దేముల్ మండలం ఎంపిటిసి ఫోరం అధ్యక్షుడు ధన్‌సింగ్ ,మంబపూర్ ఎంపిటిసి శ్రీను,తట్టెపల్లి పిఏసిఎస్ వైస్ చైర్మన్ అంజి,పెద్దేముల్ మాజీ వైస్ ఎంపిపి లక్ష్మణ్,నాయకులు ఆబేద్ చౌష్,సచిన్ ,శాంతప్ప, లక్ష్మణ్, సతీష్, చందు, రమేష్,సీనియర్ జర్నలిస్టులు రవి శంకర్,రామ్ చందర్,శుభప్రద్ పటేల్, యువసేన సభ్యులు భాను,కుర్వ బాలు,రాము గౌడ్,నరేష్ గౌడ్,విజయ్, హరీష్, శ్రీశైలం,శుభప్రద్ పటేల్,అభిమానులు,యువకులు ,తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వైభవంగా శివ పార్వతుల కళ్యాణం

### -వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, ప్రముఖులు



బుగ్గోని గూడ శివాలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తదితరులు

**నందిగామ ఫిబ్రవరి 1,ప్రభాతవార్త :**
నందిగామ మండలం బుగ్గోనిగూడలో జరిగిన శివపార్వతుల విగ్రహాప్రతిష్ట కళ్యాణమహోత్సవం బుధవారం కనుల పండువగా జరిగింది.ఈ కళ్యాణ మహోత్సవానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్,జడ్పివైస్ చైర్మన్ ఈట గణేష్,కేశంపేట ఎంపిపి వై.రవిందర్ యాదవ్,జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి,ఎఎం సిమాజీ చైర్మన్ నారాయణ రెడ్డిలు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..శివుడు బోలాశంకరుడుని, శివపార్వతుల కళ్యాణం చూసిన వారి జన్మధన్యమన్నారు.ఆహ్లాద ప్రదేశంలో అందంగా నిర్మించారని బుగ్గోని గూడ గ్రామస్థులను అభినందించారు.శివుని కృపవల అందరికి మంచి జరిగేలా దీవించమని వేడుకున్నట్లు చెప్పారు.ఈ వేడుకల్లో సర్పంచ్‌లు జిల్లెల వెంకట్ రెడ్డి,జెట్ట కుమార్,గోవిందు అశోక్,చెగూరు సొసైటి చైర్మన్ జి.అశోక్,మాజీ చైర్మన్ విఠల్ ,రంగాపూర్ సర్పంచ్ ఎనుగొండ రమేష్ గౌడ్,బుగ్గోని గూడ సర్పంచ్ బండి నీలమ్మ,ఉప సర్పంచ్ స్వరూప,నాయకులు బండి రాజు,బుగ్గ నర్సింహ్మా,బుగ్గ సాలయ్య,రెడ్డమోని శేఖర్, బండి బుచ్చయ్య,బండి రమేష్,మల్లేష్,పాండు భక్తబృందం,పాల్గొన్నారు.

**శివాలయంలో వీర్లపల్లి శంకర్ పూజలు :**
బుగ్గోని గూడలో కొలువైన స్వామిని,మహాలింగాన్ని దర్శించుకొని టిపిసిసి ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ప్రత్యేక పూజలు చేశారు.శివుడు అభిషేక ప్రియుడని,ప్రతిరోజు దైవాన్ని దర్శించుకొని ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని సూచించారు.బుగ్గోని గూడ గ్రామస్థులతో పాటు ప్రజలందరికి శివుని దీవెనలుండాలని కోరుకున్నట్లు చెప్పారు.వీర్లపల్లి వెంట కొత్తూరు.నందిగామ కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి,జంగ నర్సింలు,ఎంపిటిసిలు, కొమ్ము కృష్ణ,చంద్రాపాల్ రెడ్డి,దేవల్లే కుమార్ గౌడ్,పసుల బుచ్చయ్య,బుగ్గ శ్రవణ్ గూళ్ల రాంచెంద్రి,అనంతయ్య,శ్రీనివాస్,భాస్కర్,రాగులపల్లి,శేఖర్,బుగ్గ అనిల్,కృష్ణ,తదితరులు ఉన్నారు.మూడురోజుల పాటు జరిగిన వేడుకలతో ఆలయ పరిసర ప్రాంతం భక్తులతో కిటకిటలాడి ఆధ్యాత్మికతను సంతరించుకుంది.

# బీసీల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.20వేల కోట్లు కేటాయించాలి

### - బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు.

**తాండూరు, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :**
బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో రూ.20వేల కోట్లు కేటాయించాలని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు, తాండూరు నియోజకవర్గ కన్వీనర్ కందుకూరి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుదవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీసీ సంక్షేమం కోసం 2017లో బీసీ ప్రజాప్రతినిధులతో సీఎం కేసీఆర్ మూడు రోజులు చర్చించి 210 తీర్మానాలకు ఆమోదం తెలిపారని గుర్తు చేశారు. కానీ నేటి వరకు అమలుకాకపోవడం చాలా విచారకరమని అన్నారు. బీసీ సంక్షేమం కోసం 210 తీర్మానాలను వెంటనే అమలు చేయాలని, తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.20 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిదంగా బీసీ కార్పోరేషనన సబ్సిడి రుణాల కోసం రూ.4వేల కోట్లు కేటాయించాలని కోరారు. విదేశీ విద్య కోసం గత ఏడాది రూ.60వేల కోట్లు కేటాయించారని, అవి ఏమూలన సరిపోవడం లేదని అన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ. 300కోట్లకు పెచాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 271 గురుకుల పాఠశాలలు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయని, గురుకుల పాఠశాలల అధునిక బవనాల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ షుకూర్, జిల్లా నాయకులు గడ్డం వెంకటేష్, నాయకులు లక్ష్మణచారి, నరేందర్, బసంత్‌కుమార్, బోయ రాధాకృష్ణ, బస్వరాజ్, యువనాయకులు రాము, జుంటుపల్లి వెంకట్, శ్రీనివాస్, అజిత్ ఠాకూర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే ఎన్నికల్లో కచ్చితంగా ఎమ్మెల్యే బరిలో ఉంటాం

### - 9న కార్యకర్తల సమావేశంతో నిర్ణయం తీసుకుంటాం
### -గత ఎన్నికల్లో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి గెలుపుకు కృషి చేశాం
### -ఈ సారి మాత్రం ఎమ్మెల్యే టికెట్ తమకే ఇవ్వాలి
### : మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి



డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని సూచిస్తున్న మాజీ ఎమ్మెల్యే

**కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 1 (ప్రభాతవార్త):**
ఈ సారి రాబోయే ఎన్నికల్లో కచ్చితంగా ఎమ్మెల్యే బరిలో ఉంటూ పోటీ చేస్తామని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి అన్నారు. ఈ నెల 9న కార్యకర్తల సమావేశంతో నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. బుధవారం కొడంగల్ పట్టణ శివారులో కొనసాగుతున్న డబుల్ బెడ్ రూం ఇళ్లను ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్, ఇంజనీర్‌కు సూచించారు. గతంలో కొడంగల్‌లో రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన బాధితుల కోసం తన అత్తమ్మ పార్వతమ్మ దేశ్‌ముఖ్ 3 ఎకరాల 2 గుంటల భూమిని అందించడం జరిగిందని తెలిపారు. ఇళ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత తమ అనుమతి లేకుండా ఎవరైనా ఇళ్ల ప్రారంభోత్సవం చేయరాదన్నారు. అనంతరం విలేకరులు ఈ సారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తారా అడగగా కచ్చితంగా పోటీ చేస్తామన్నారు. గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి ఒక్కసారి అవకాశం కల్పించాలనే సూచనతో నరేందర్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేశామన్నారు. కానీ ఈ సారి వెనక్కు తగ్గేదే లేదని, తన వయస్సు పైబడటంతో తాను రాజకీయ సలహాదారుడిగా ఉంటానే తప్ప పోటీ చేసేది లేదన్నారు. తన కుమారుడు, కొడంగల్ మున్సిపల్ చైర్మెన్ జగదీశ్వర్‌రెడ్డి రాబోయే ఎన్నికల్లో పోటీ చేస్తారని తెలిపారు. ఈ సారి కూడా టికెట్ తనకే వస్తుందని, ఎమ్మెల్యే బరిలో తానే ఉంటానని స్థానిక ఎమ్మెల్యే ప్రచారం చేసుకోవడం సరైంది కాదన్నారు. ఈ విషయంపై పార్టీ అధిష్టానం దృష్టి సారించి ఈ సారి ఎమ్మెల్యే టికెట్ తమకే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జయతీర్థచారి, మాఫీ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

**పెద్దేముల్, పిబ్రవరి 1, ప్రభాతవార్త:**
విద్యాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేసిందని తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. మన ఊరు మన బడి కార్యాక్రమంలో భాగంగా బుదవారం పెద్దేముల్ మండలం కందనెల్లి ప్రాథమిక పాఠశాలలో రూ.14.81 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దే భాధ్యత ప్రతి ఉపాధ్యాయునిపై ఉందని గుర్తుచేశారు.పాఠశాలలలో మౌళిక వసతుల కల్పనకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో కృషిచేస్తోందని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. దేశంలో ఎక్కడలేని విధంగా మన ఊరు మన బడి కార్యాక్రమంలో పాఠశాలలకు అత్యధిక నిధులు మంజూరు చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు. పాఠశాలలో వాటర్ ఫిల్టర్ కావాలని సర్పంచ్, ఉపాధ్యాయులు అడుగగా మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హమి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మెన్ రాజుగౌడ్, యంపిపి టి.అనురాధరమేష్, వైస్ యంపిపి మధులత శ్రీనివాస్, సర్పంచ్ టి.మోహన్‌రెడ్డి, పెద్దేముల్ సొసైటి చైర్మెన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి, మండల విద్యాధికారి వెంకటయ్య గౌడ్, యంపిటిసిల ఫోరం రాష్ట్ర ఉపాద్యాక్షుడు వెంకటేష్‌చారీ, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి,

యంపిటిసిల ఫోరం అధ్యక్షుడు ధన్‌సింగ్, సీనియర్ నాయకులు కొమ్ము గోపా ల్‌రెడ్డి,రుక్మాపూర్ రమేష్,జితేందర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారిజ, ఉపాధ్యాయులు ప్రమోద్, రాధిక, భారతి, మణి, సరోజా, దీప్తి,ఎస్ఎంసి చైర్మెన్ భూమె నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## అవుశాపూర్‌లో కంటి వెలుగు వైద్య శిబిరం ప్రారంభం



అవుశాపూర్‌లో కంటి వెలుగు వైద్య శిబిరంలో పాల్గొన్న ఎంపీపీ వై. సుదర్శన్ రెడ్డి, సర్పంచ్ వై. కావేరి తదితరులు.

**ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:**
మండలంలోని అవుశాపూర్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు రెండో విడత కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ ఏనుగు కావేరి, ఉప సర్పంచ్ ఏలుసాని అయిలయ్య యాదవ్, వార్డు సభ్యులు బొడిగే శ్రీనివాస్ గౌడ్, ముద్దం రాధ, డాక్టర్ సౌమ్య, కో ఆప్షన్ సభ్యుడు నర్సింహ గౌడ్, జయశ్రీ, నాయకులు ఏనుగు మశ్చేందర్ రెడ్డి, సాయిలు, వామన్ రెడ్డి, దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

### జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య



పోచారం మున్సిపల్ అన్నోజిగూడలో కంటి వెలుగు వైద్యశిబిరాన్ని రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య.

**ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:**
రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని కంటి బాధితులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య అన్నారు. పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడ ఎస్టీ కమ్యూనిటీ హాలులో బుధవారం కంటి వెలుగు వైద్య శిబిరాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అంధత్వ నివారణకు ప్రభుత్వం చేపట్టిన మంచి కార్యక్రమాన్ని ప్రజలు వైద్య శిబిరానికి విచ్చేసి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, వైస్ చైర్మన్ నానావత్ రెడ్యా నాయక్, కమిషనర్ ఎ. సురేశ్, ఏఈ. నరేశ్, కౌన్సిలర్లు చింతల రాజశేఖర్, సింగిరెడ్డి సాయిరెడ్డి, మున్సిపల్ మేనేజర్ నర్సింహులు, కంటి వైద్య నిపుణులు శ్రీనివాసులు, మున్సిపల్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఎన్. శేఖర్ ముదిరాజ్, నాయకులు బోయపల్లి సత్తిరెడ్డి, కేఎం. రెడ్డి, అబ్బవతి నర్సింహ, బి. రాజేశ్వర్ రెడ్డి, తిలక్, నల్లవెల్లి మురళి, గాంధారి నవీన్, సంతోశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## దాదాపూర్‌లో శివాజీ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్ క్రిష్ణ

**దోమ పిబ్రవరి 1 ప్రభాతవార్త :**
మండల పరిధిలోని దాదాపూర్ గ్రామంలో శివాజీ విగ్రహం ఏర్పాటుకు బుధవారం నాడు గ్రామ సర్పంచ్ క్రిష్ణ ఆద్వర్యములో భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాజకీయాలకు అతీతంగా చత్రపతి శివాజీ విగ్రహం ప్రతిష్టాపన ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.శివాజీ సైనిక కుటుంబంలో పుట్టి మహా చక్రవర్తిగా కీర్తి ప్రతిష్టలు సాదించారని ఓటమి ఎరుగని మహావిరుడని అన్నారు.గ్రామములోని ప్రజలందరు విగ్రహం ఏర్పాటుకు అందరు కలిసి రావాలని కోరారు.ఈ కార్యక్రమములో యంపిటిసినర్సిములు,గ్రామస్తులు ప్రకాశ్‌రెడ్డి,కుర్వ వెంకటయ్య, బసన్నగౌడ్, కమ్మరి యాదగిరి చారి,బాలయ్య,రాములు గౌడ్, రాఘవెందర్‌గౌడ్,గపార్,గురదాస్, అంజిలయ్య,దస్తయ్య,శివకుమార్,రమేశ్.తదితరులు పాల్గోన్నారు.

## 40వ పాదుకా పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే



పూజా కార్యక్రమంలో మహేశ్‌రెడ్డి.

**దోమ.పిబ్రవరి 1 ప్రభాతవార్త :**
మండల పరిధిలోని దాదాపూర్ గ్రామ శివారులో ఉన్న శ్రీశ్రీశ్రీ అచల గురవు అంజిలయ్య స్వామి 40 వ పాదుకా పూజా కార్యక్రమం జరుగుతున్నాయి.ఈ సందర్భంగా పర్గి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి హాజరై పూజా కార్యక్రమంలో పాల్గోన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రతి ఒక్కరుదేవాలయాలను సందర్శించుకొని మనశ్శాంతి పొందాలని సూచించారు.ఈ సందర్భముగ దేవాలయంన వారుశాలువాలు,పూలమాలలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి నాగిరెడ్డి,మండల రైతుసంఘం అద్యక్షులులక్ష్మయ్య,దోమ సర్పంచ్ రాజిరెడ్డి,గుండాల్ సినియర్ నాయకులు జగత్‌రెడ్డి,ప్రబాకర్‌రెడ్డి, తదితరులు పాల్గోన్నారు.

## ఆలంపల్లి దర్గాలో పూజలు చేసిన జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



ఆలంపల్లి దర్గా వద్ద ప్రార్థనలు చేసిన జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

**వికారాబాద్, ఫిబ్రవరి 01, ప్రభాతవార్త:**
జిల్లా కేంద్రంలోని ఆలంపల్లి హజ్రత్ అలం షహీద్ రహ్మతుల్లాః హుస్సేన్ దర్గా వద్ద మైనారిటీ నాయకులతో కలిసి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పి.సునీతారెడ్డి బుధవారం సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన భాగం రాష్ట్ర నాయకులు వడ్ల నందు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామచంద్రారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్, పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, సిద్దలూరు గ్రామ సర్పంచ్ ఆంజనేయులు, మైనార్టీ నాయకులు జహంగీర్, సిద్ధిక్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

### -ఆదిభట్ల ఎస్ఐ టి.రవికుమార్

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:**
సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రతీ ఒక్కరు అవగాహన పెంపోందించుకునే అవసరం ఎంతైనా ఉందని ఆదిభట్ల ఎస్ఐ టీ.రవికుమార్ అన్నారు. బుధవారం పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాటట్లాడుతూ గతంలో దొంగలు ఇళ్లల్లో చోరబడి ధనం దోచుకునే వారని,ప్రస్తుతం ఆన్‌లైన్‌లో దోచుకుంటున్నారని చెప్పారు.నేటి సమాజంలో యువతలో ఆన్‌లైన్ వాడకం పెరిగిందని దీంతో అనవసరమైన ఆప్‌లు డౌన్‌లోడ్ చెసుకోని మోసపోతున్నారని అన్నారు.ప్రస్తుతం సైబర్‌క్రైమ్‌లో జరుగుతున్న సంఘటనలను విద్యార్థులకు ఉదాహారణ ద్వార అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మినారాయణ,ఏఎస్ఐ శ్రీనివాస్,రాజు హెడ్‌కానిస్టేబుల్,సందీప్ కానిస్టెబుల్,కళాశాల ప్రెన్సిపాల్ రాజు,ఎజిఎం మల్లికారుర్జున్, విద్యార్థులు తదితరులున్నారు.



సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు